" సాయంకాలం వరకూ నేను ఆగలేనుగానీ...అదేమిటో, ఇపుడే చెప్పవా? నీకు తెలుసంటున్నావు.." అంటూ వెంటతిరిగింది. ముందురోజు బాబాయ్ కి చెప్పిన మాట ఈ పాటికే చాలా మందికి చేరేఉంటుంది. సాయంకాలానికి అందరికీ తెలుస్తుంది!

ఇలాంటి ఊరులో ఏ వార్త అయినా ఒకరికి అందితే చాలు శరవేగంగా ప్రయాణించి అందరికీ చేరిపోతుంది! అలా జరగకపోతేనే ఆశ్చర్యపోవాలిగానీ జరిగితే కాదు అనుకుంటూ అవని నవ్వుకుంది.

అవని అందర్నీ కూర్చోబెట్టి సుభాష్ వివరాలన్నీ క్లుప్తంగా చెప్పింది. తన అభిప్రాయమూ చెప్పేసరికి సమస్య తీరినట్లయ్యి సంతోషంతో అందరి ముఖాలూ వికసించాయి! ఇక పెళ్ళి ఎప్పుడు ...ఎలా..ఎక్కడ ...అలాంటి ఆలోచనలు ఆనందంగా మొదలుపెట్టేశారు. అవని ఆ మాటలనుండి తప్పించుకోవటానికన్నట్లుగా గదిలోకి వెళ్ళిపోయింది. నాన్నమ్మ భుజం చుట్టూ చేతులువేసి, " నీకు సంతోషమేనా...ఏమైనా అభ్యంతరం వుందా ? " సరదాగా అడిగింది అవని.

" మన కుటుంబం నచ్చి మనతో సంబంధం కలుపుకోవాలని ఉబలాటపడుతున్నట్లుగా నీ మాటలనుబట్టి అర్థమయ్యింది. మరి..నువ్వు...అంతగా నచ్చలేదేమోనే ! మంచి కుటుంబం అని సరిపెట్టుకుంటున్నాడు కాబోలు !" అందావిడ అవనిని నవ్వు మొహంతో చూసి.

" అవునవును. చిట్టెమ్మ మనవరాలికంటే, చిట్టెమ్మగారే బాగా నచ్చారంట! చూసావా..నాకు ఎలాగో నీ పేరునుబట్టి సంబంధం కుదిరింది! చిట్టెమ్మ మనవరాలిని కావటం నిజంగా నా అదృష్టం !"  ఆవిడను చేతులతో చుట్టేసి ఫక్కుమంది అవని.

సాయంకాలం వచ్చిన వరాలు అవనిని చూసి " తెలిసిందిలే...ఆ వార్త ! " ముభావంగా అంది.

" ఎందుకలా కొంచెం కోపంగా వున్నట్లున్నావ్ ? " ఆరా తీసింది అవని.

" నాకు...కోపం రాదా...నన్ను పిలవకుండా..నాకు తెలియకుండానే నీ నిశ్చితార్థం జరిగిపోవటం ఏమిటీ ? ఏదయినా ముందుగా నాకు తెలియకుండా అందరూ ' ఏమిటీ ...నీ ఫ్రెండ్ కి నిశ్చితార్థం జరిగిందా ? ' అని అడగటం నాకు చిన్నతనంగా వుండదా ? "

" అదికాదే...నిజంగా నిశ్చితార్థమంటూ ఫంక్షన్ జరిగితే, నీకు తెలియకుండా ఉంటుందా? నువ్వు లేకుండా జరుగుతుందా ? నాకు తెలుసు...ఆ మాట ఎన్నో రూపాలు మార్చుకుని తిరుగుతుంది! నేను కావాలనే...నిర్ణయించుకున్నామనే మాటని బాబాయ్ కి అలా చెప్పాను. రేపు నిన్నెవరైనా నాకు పెళ్ళి కూడా అయిపోదంటకదా అని అడిగితే, నమ్మేస్తావా ? " అంది అవని నవ్వుతూ.

అలక వీడినట్లుగా వరాలు మొహం తేటపడింది.

" నా పెళ్ళికి నువ్వే పట్టుచీర కట్టుకుని....పెళ్ళిపెద్దలా హడావుడి చేయాలి..!" అంది అవని. కాసేపు ఆగి " నేను మాత్రం పట్టుచీర కట్టుకోలేను. కాటన్ దే నాకు ఇష్టం!" అంది.

వరాలు పెద్దగా నవ్వింది. " అలా జరిగితే మాత్రం భలే నవ్వులాటగా ఉంటుంది! నన్ను చూసి అందరూ నవ్విపోతారు! అయినా అవనీ..ఇప్పుడే చెబుతున్నా... మీ ఇద్దరి ఇష్టాలూ ఏమీ చెల్లవ్! అంతగా మీకు మరీ నచ్చని ఆచారం ఏదైనా వుంటే...మాకు చెప్పి ఒప్పించుకోవాల్సిందే! నేను దాచిపెట్టుకున్న డబ్బుతోనే నీకు పెళ్ళి పట్టుచీర కొంటాను! ఎలా కట్టుకోకుండా ఉంటావో చూస్తాగా!"

అవని వరాలు భుజం మీద చేయిపేసింది. " కోపం, అలకలాంటివి నీకస్సలు నప్పవు. ఇలా నవ్వుతూ సరదాగా మాట్లాడుతుంటేనే...మా అందరికీ బావుంటుంది!" ఆత్మీయంగా అంది.

వరాలు కళ్ళు చెమ్మగిల్లాయి." ఈ అభిమానానికేగా నేనీ ఇంటికి కట్టుబడిపోయానూ..ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుందన్నా వెళ్ళలేనూ!" అనుకుంది మనసులోనే.

" అవనీ...పెళ్ళి అయ్యాక మీరు...ఎక్కడ వుంటారూ ?" అనడిగింది.

" అవును కదూ...ఆ ఆలోచనే నాకు రాలేదే..." అంటూ ఆలోచనలో పడింది అవని.

*****

" అక్కా...నాకు సుభాష్ గారంటే ఇష్టంలేదు.." విస్సు బుంగమూతి పెట్టాడు.

" ఎందుకనీ..?" అవని ఆశ్చర్యంగా చూసింది.

" అపుడెపుడో...మనింటికి వచ్చినప్పుడు...నన్ను చూసి " నీకు పదేళ్ళయినా ఉంటాయో, ఉండవో.." అంటూ అవమానించారు! నేనంత పిల్లాడిలా పొట్టిగా వుంటానా..""

అవనికి నవ్వొచ్చింది. వాడిని దగ్గరకు తీసుకుని లాలనగా చెప్పింది. " రేపో మాపో కాలేజికి వెళ్ళే కుర్రాడిలానే వున్నావుగానీ...మామూలుగా అయితే అందరూ ...ముఖ్యంగా ఆడవాళ్ళయితే మరీను...వయసు తక్కువని ఎవరైనా

అనుకుంటే చాలా సంతోషం!" అంతా అవని ప్పేస్తార్రా! ఆ ఉద్దేశ్యంతోనే అలా అని ఉంటారు! నిన్నెవరైనా చూస్తే కాలేజీ కుర్రాడనుకుంటారుగానీ హైస్కూల్ స్టూడెంట్ వని నమ్మలేరట! "

" అంతేనంటావా..సుభాష్ గారు అందుకోసమే అలా అని వుంటారు. ఈ సారి నేనే చెబుతాలే..నాకలాంటి ఫీలింగ్స్ లేవని!" ఆనందంగా అన్నాడు.

" అంటే...ఏం చెబుతావురా..?"

" అర్థం కాలేదా...వయసు వివరం చెప్పి నన్ను చిన్నపిల్లాడినని అంటే సంతోషించే రకాన్ని కాదనీ చెబుతాను..." అన్నాడు తలెగరేసి.

" ఏమిటో ...వీడో రకం! చిన్నపిల్లాడంటే చిన్నబుచ్చుకుంటాడు! పెద్దవాడినైపోవాలని తొందర!" ముద్దుగా విసుక్కుంది.

ఆ రాత్రి నారాయణమూర్తి , బయటకు వెళ్ళి ఇంటికి  వచ్చాక కూడా పెళ్ళి కబుర్లే ! " అంతా అవని పెళ్ళి కబురు గురించే ఆరా తీస్తున్నారు....ఎప్పుడు నిశ్చితార్థం జరింగిందంటూ ఒకటే ప్రశ్నలు! 'అనుకున్నాం అంతేగానీ అలాంటిదేం ఉండదిక, ఒకసారే పెళ్ళి...' అని అందరికీ చెప్పాల్సివచ్చింది!"

ఆ రాత్రి సుభాష్ ఫోన్ చేశాడు.

తమ ఇంట్లో జరిగిన పెళ్ళి కబుర్లన్నీ సరదాగా వివరించింది.

" అవునుగానీ అవనీ...నేను వైజాగ్ లో ఇంకో రెండురోజులు ఉండాల్సివస్తుంది. నువ్వు ఈలోగా ఊళ్ళోవాళ్ళకి గుడికి సంబంధించిన వివరాలూ అవీ...తెలియజేస్తావా ? అది నా బాధ్యతే అనుకో...నేను వచ్చేలోపు అందరికీ అపోహలు ఇంకా పెరిగిపోతాయేమోననీ.."

" తప్పకుండా...నాకూ ఆ బాధ్యత ఉంది. ఇక్కడ మీరు లేనప్పుడే ఆ వివరాలు అన్నీ చెప్పటం బావుంటుంది"

" అవనీ...గుడి ఆదాయాన్ని ఇలా వినియోగించాలనే ఆలోచన నాకు భగవంతుడే కలిగించి ఉండొచ్చు కదా! భగవదనుజ్ఞ ప్రకారమే నేనలా చేశానేమో!" చిన్నగా నవ్వాడు.

" అవును. ఈ మాట నిజమే అయుంటుంది. రేపటి సమావేశంలో మీరీ మాట అన్నట్లుగా చెబుతాను! అయినా...అమ్మ మాట అయితేనేం, భగవంతుని ఆజ్ఞ అయితేనేం..ఒకటే నా దృష్టిలో! ఏదైనా ఉపకారమే చేశారుగానీ ఇందులో ఎవరికీ అపకారం జరగలేదు కాబట్టి....ఫరవాలేదు, అంత సంజాయిషీ అవసరం లేదు! "

అప్పుడే అవని గదిలోకి వచ్చిన చిట్టెమ్మ " సుభాష్ తోనేనా మాట్లాడుతున్నావ్..నాకూ ఓసారి ఇవ్వు..మాట్లాడాలి.." అంటూ అవని చేతిలోని ఫోను లాక్కుంది.

" అబ్బాయ్... సుబ్బూ...నేను చెప్పిన సంగతి...అదే సినిమాలగురించి రాయమని చెప్పింది ఆలోచిస్తున్నావా....పక్కన పెట్టేశావా ?"

" తప్పకుండా రాస్తాను బామ్మా...! అయితే నేనీ మధ్య సినిమాలు అస్సలు చూడటంలేదు. వాటి తీరుతెన్నూ నేనూ తెలుసుకుని రాస్తే ఇంకా బావుంటుందిగా. రేపు వరసగా రెండు టి.వి.లోనో, హాల్లోనో చూసేసి..రాస్తా. కొత్త సినిమాలేమున్నాయి...చూసి ఉంటారుగా?"

" ఏం చూడలేదు...ఈ ఊళ్ళో ఉన్నది ఒకే ఒక్క హాలు. పదిరోజులకొకటి మారుతుంది. రేపో ఎల్లుండో వెళ్ళాలి. నాకసలే ఒంట్లో బావుండటంలేదు కూడానూ.."

" ఒంట్లో బావుండకపోతే డాక్టరు దగ్గరకు కదా వెళ్ళాలీ..?"

" మామూలుగా అయితే అంతే అనుకో! కానీ నాలాంటివాళ్ళకి..సినిమా వైద్యం అనేది బాగా పనిచేస్తుంది. ఏదైనా మంచి సినిమా చూసి వస్తే...రోగం వున్నా చటుక్కున ఎగిరిపోయి హుషారుగా ఉంటుంది!"

" భలేగా చెప్పావ్ బామ్మా ! నేనెంత అజ్ఞానినో నాకిప్పుడు అర్థమయింది! ఇలాంటి వైద్యం సంగతి నాకిప్పటి వరకూ తెలియనేలేదూ.." పెద్దగా నవ్వాడు.

" పోనీ...లాఫింగ్ థెరపీ అని ఈ మధ్య అంటున్నారు...దాని గురించి విన్నావా ? ఇప్పుడు నవ్వినట్లుగా హాయిగా అలా మనసారా నవ్వుతూండు. అదీ మంచి వైద్యమేనట! మీరిద్దరూ ఎప్పుడూ సరదాగా నవ్వులతో రోజుల్ని గడిపెయ్యాలి! అవని ఒక క్షణం దిగులుగా కనిపించినా నేను తట్టుకోలేను! నవ్వించే ప్రయత్నం చేస్తాను! ఇకనుండీ ఆ బాధ్యత నీదే! సరేనా..? ఈ హామీ నాకు ఇవ్వాలి నువ్వు!"

" బామ్మా..ఈ బాధ్యతను నేను ఆనందంగా స్వీకరిస్తున్నాను. అవును బామ్మా....ఒంట్లో బావుండనప్పుడు అవనినీ సినిమాకి తీసుకెళ్తే సరిపోతుందిగా?" హాస్యంగా అడిగాడు.

ఆవిడ కొంచెం కోప్పడుతున్నట్లుగా అంది " శరీరతత్త్వమూ, మనస్తత్వమూ తెలుసుకుని వైద్యం చేయాలి! సినిమా వైద్యం నాకు మాత్రమే సరిపడుతుంది! అవనిని మాత్రం డాక్టరు దగ్గరకే తీసుకెళ్ళాలి! అవని గురించి నువ్వు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్తొచ్చినప్పుడల్లా చెబుతూనే ఉంటాలే.." అంటూ ఆవిడ ఫోను అవని చేతికి ఇచ్చేసి అక్కడినుండి వెళ్ళిపోయింది.

" మీ నాన్నమ్మ...అదే మా బామ్మ..నేను అలాగే పిలుస్తున్నాకదా, గొంతు గద్గదమైపోయినట్లు నాకు అనుమానం వచ్చింది! అవనీ...నేను నిన్ను సంతోషంగా ఉంచగలననే భరోసా నా తరఫున నువ్వే కలిగించాలి మరి ! ఇంకొకటి. బామ్మకి సినిమా వైద్యంలా నాకు బామ్మ మాట వైద్యంలా పనిచేస్తుందని అనుకుంటున్నానని చెప్పు. నాకెపుడు ఒంట్లో

బావుండకపోయినా, మనసు భారంగా ఉన్నా బామ్మ దగ్గరికి వచ్చి కూర్చుని కాసేపు మాట్లాడితే ఉల్లాసం వచ్చేస్తుందనిపిస్తోంది! బామ్మ నిజంగా అంత సరదాగా మాట్లాడుతుంది కదూ..?"

" అవును. ఈ మాట నానమ్మకి చెబుతాను. తనగురించి మీరలాంటి సర్టిఫికెట్ ఇచ్చినందుకు సంతోషిస్తుంది! అది సరేగానీ...మిమ్మల్ని ఒకటి అడగనా?"

" అవనీ...అలా పర్మిషన్ లా అడగనవసరంలేదు. నేను చెప్పేది విని జవాబు చెప్పూ..అని చెవి మెలేసినట్లుగా అడుగు..సరేనా?"

" అయితే నేను వినయాన్ని...కొత్తగా కొనితెచ్చుకోవాలసిన పని లేదని ...అర్ధమైంది! నాకూ పెత్తనం చేయటమంటేనే ఇష్టం..అదే సాగిస్తానైతే..! " అంటూ నవ్వింది.

" ఇంతకీ అడగాలనుకున్నది ఏమిటంటే...పెళ్ళి సమయంలో...నేను దేముడికి దండం పెట్టనూ, ఇది చేయనూ, అది కూడదూ అనే అభ్యంతరాలేమైనా ఉన్నాయా అని ! ఎందుకంటే, ఇక్కడ ఇంట్లో..వరాలుతో సహా అందరూ ' పెళ్ళి తర్వాత మీ ఇష్టాలేమిటో మీవిగానీ..అప్పటివరకూ మా ఇష్టాలే సాగాలీ అంటున్నారు మరి"

" నేనెందుకని దేముడికి దండం పెట్టే రకంకాదని అనుకున్నారూ? నేను  మనసులోనే దేముడికి నమస్కరిస్తాను! ప్రార్ధన మనిషికి సాంత్వనా, శాంతీ కలిగిస్తుందని నమ్ముతాను! మన పెద్దలే ' మానవసేవే మాధవ సేవ ' అని చెప్పలేదా?

గుడి ఆదాయాన్ని జనం సంక్షేమం కోసమే వినియోగిస్తే తప్పేంలేదనే అనుకున్నాను. పూజా విధానాలూ, దైవ స్వరూపాలూ..అవీ మారవచ్చు. నచ్చినదానినే ఎన్నుకునే హక్కు అందరికీ ఉంటుంది! అలాగే నాకూనూ...నా పద్ధతి వేరేగా, కొత్తగా అనిపిస్తుందేమో!

అవనీ...ఇంకోటి చెప్పనా? నాకు నచ్చదేమోనని..ఆ తతంగం అలా అలా కానిచ్చేయాలనీ అనుకోవద్దు. నిజం చెప్పాలంటే..నాకు చాలా సరదా కూడానూ! నీతో ముచ్చట్లాడుతూ పెళ్ళి పీటలమీద ఎంతసేపైనా కూర్చోగలను! నాకేం అభ్యంతరం లేదు! ఇదంతా దేనికిగానీ...అందరం కలిసి కూర్చుని ఏమేం చేయాలీ ఎలా చేయాలీ నిర్ణయించుకుందాం!

పెళ్ళి మన ఇద్దరికేగానీ...కుటుంబం..బంధువులు అంతా పాల్గొనే వేడుక కూడా కదా! అందుకని వాళ్ల ఇష్టాల్నీ ఒప్పుకోవాల్సిందే! నేను చాలా సహజంగా మీరునుండి ఏకవచనంలోకి గెంతేశానని ఇపుడే తెలుసుకున్నాను! నీ ఇష్టప్రకారం నువ్వూ అలాగే చేయి!"

అవని హాయిగా నవ్వింది. " ఇకసరే...రేపటి విశేషాలు రేపు రాత్రికి.." అంటూ ఫోను ఆపేసింది. అందరిమధ్యా అలా పెళ్ళి కబుర్లే సాగుతూ ఉండటంతో అవనికి ఏదో కొత్తగానూ, సరదాగానూ కూడా అనిపించింది!

******

సమితి ఆఫీసు హాలులో ఆ ఊరుకి సంబంధించిన కొందరు పెద్దలు, యువకులు, కొద్దిమంది ఆడవాళ్ళూ సమావేశమయ్యారు. నారాయణమూర్తిని వద్దని అవని వచ్చింది.

కమిటీలవారీగా ఊరుకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించేవాళ్ళంతా ఏ నిర్ణయం తీసుకోవాల్సివచ్చినా వాళ్ళందరూ అలా సమావేశం అవ్వటం మామూలే.

ఊరు సమస్యల గురించి చర్చించి, ఏ నిర్ణయాలు ఎవరెవరు అమలుపరచాలో బాధ్యతల్నీ నిర్ణయించుకోవటం రివాజు. ఆ రోజు అలాగే సమావేశమయ్యారు.

ఊరులో..సుభాష్ గురించి వచ్చిన వదంతులే అందరూ మాట్లాడుకునే విషయం అయింది. అవని అందరికీ సుభాష్ ద్వారా తెలుసుకున్న నిజాలంటూ ఆ వివరాల్ని వెల్లడించింది. అవనికి అన్న వరసయ్యే ఒకతను " అవనీ...నువ్వేమైనా చెప్పు...మాకు మాత్రం సుభాష్ గారు భయం, భక్తీ లేకుండా గుడి ఆదాయాన్ని దేముడికీ, గుడికి ఖర్చు పెట్టకుండా ఇంకేవో వాటికి వినియోగించటం తప్పు...పాపంగా అనిపిస్తోంది!" అన్నాడు.

" గుడికీ, దేముడికీ ఎలా ఖర్చు పెట్టాలంటావ్?" అవని కొంచెం తీవ్రంగానే అడిగింది.

" అదీ తెలియదా? పక్కపక్కనే ఎన్నో దేవతా విగ్రహాల్ని ప్రతిష్ఠించవచ్చు. దేముడికి రకరకాల వజ్రాభరణాలూ ఆదాయాన్ని బట్టి చేయించవచ్చును..."

" గుడికి అవసరమైన హంగులన్నీ చేయిస్తూనే వున్నారు. గమనించలేదా? అందరూ పురాణ కాలక్షేపాలకి కూర్చోవటానికి వీలుగా పెద్ద మండపమూ కట్టించారుగా?"

" ఇప్పుడు సుభాష్ గారితో బంధుత్వం కలుస్తోంది కాబట్టి మీకు ఆయన తప్పులన్నీ ఒప్పులుగానే కనిపిస్తాయిలే! అందులో ఆశ్చర్యం ఏముందీ!" వ్యంగ్యంగా అన్నాడు.

అవనికి ఆవేశం వచ్చిందిగానీ నిగ్రహించుకుని చిరునవ్వుతో మాట్లాడింది.

" అవును అన్నయ్యా...ఇప్పుడు ఆలోచిస్తుంటే...సుభాష్ గారిలోనివి చాలా తప్పులే కనిపిస్తున్నాయి! తల్లీదండ్రీ...తమ పిల్లలకి మంచి చదువు చెప్పించాలని అనుకుంటారా ? తమకు ఉన్నదంతా పెట్టి నగలూ, నాణేలూ చేయించేసుకుందామనుకుంటారా? నాకు తెలియదులే, నువ్వు చెప్పు ?

అవును...దేముడి కోరిక తీరేట్లుగా వజ్రాల నగలు చేయించటమే మంచిదని తెలుసుకోకుండా మన పిల్లలందరూ ఈ ఊళ్ళో...కాలేజీలో చదువుకోవటానికి వీలుగా ఆ ప్రయత్నాలు చేయటం తప్పే!

ఏదైనా రోగం వస్తే పిల్లల్నీ, వృద్ధుల్నీ తీసుకుని పట్నానికి పరుగులు పెట్టే అవసరం లేకుండా ఇక్కడే ఓ హాస్పిటల్ ఏర్పాటు చేయడం..అదీ తప్పే!

టి.వి.లకే పొద్దస్తమానూ అతుక్కుపోయే అలవాటునుండి పుస్తకాలు చదివే అవకాశం కలిగించి,పిల్లలను  పుస్తక పఠనానికి ప్రోత్సహించాలనుకోవటమూ తప్పే!

సుభాష్ గారి సిద్ధాంతం ప్రకారం, దేవాలయం మాత్రమే కాకుండా ఈ మూడు ఆలయాలూ ఉండాలట! ఆ కోరికా తప్పే. ఎవరి గోల వారిదే అనుకోక ఊరంతా మనదే అనుకోవటం కూడా తప్పే!"

అతను మొహం చిన్నబుచ్చుకుని " అంత పేళాకోళం వద్దులే...ఏ దేముడూ తనకి అలంకరణలూ, నైవేద్యాలూ కావాలని అడగడు! భక్తితో మనమే చేయించాలిగానీ..." అన్నాడు.

అవని అతనివేపు సూటిగా చూసింది.

" అదిసరేగానీ...మీ ఇంటిలో పూజలవీ బాగానే చేస్తారు కదా...కొబ్బరి చిప్పలూ, ప్రసాదాలూ ఏం చేస్తారటా..?" అనడిగింది.

" ఏం వుందీ...అందరూ చేసేదేగా...ప్రసాదం అని కళ్ళకద్దుకుని తింటాం!"

" అవును కదా....ఇక్కడా...దేముడి డబ్బూ....మన అందరికీ వైద్యం, విద్య, ప్రసాదం రూపంలో మనకు అందుతోందన్నమాట! ఆ ప్రయోజనాలన్నీ మనకే! అయినా పూజాదికాలు, నైవేద్యాలూ, పండుగవేళల్లో గుడికి ముస్తాబులూ...అన్నీ జరుగుతూనే ఉన్నాయిగా!

వీటికి పోను ఇంకా మిగిలే ఆదాయాన్ని దేముడికేం పంపించలేం కదా! మనకోసమే వినియోగించుకూంటాం! అవునా...తిరుపతి లాంటి చోట్ల దేముడి ఆదాయంతో ఎన్నెన్ని సంస్థలు నడుపుతున్నారో! అవేం తెలుసుకోకుండా తప్పు పట్టుకోవటానికి తొందరపడకూడదు!"

ఒక నిమిషం నిశ్శబ్దంగా ఉండి అవని మళ్ళీ మాట్లాడింది.

" ఈ రోజుల్లో...బెదిరించేవాళ్ళకో, భయపెట్టేవాళ్ళకో తప్ప మామూలు వాళ్ళకి అన్నమాట ప్రకారం బదులు తీర్చే అలవాటు ఉందా? లంచం అడగకుండా పనులు చేసిపెడితే, తెలివితక్కువ వాళ్ళని నవ్వుకోవటమేగానీ నిజాయితీని గుర్తిస్తున్నామా? మంచితనం అనేది ఎక్కడున్నా, ఎవరిలో ఉన్నా గుర్తించి గౌరవించటం మంచి అలవాటు!

ఎప్పుడో...తాతగారి వల్ల జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని తల్లికిచ్చిన మాట ప్రకారం ఈ ఊరుకి వచ్చి....ఊరి బాగోగులు పట్టించుకుని..అంతలా శ్రమించిన వ్యక్తిని గౌరవించాలా....తప్పు పట్టాలా...దేముడి ఆదాయం, విరాళాలే కాకుండా తన స్వంత ఆస్తినీ ఊరు కోసమే ఖర్చుపెట్టిన మనిషిని ఏమని నిలదీద్దాం? చెప్పండి...అందరూ...?"

అవని మాటల్లోకి ఆఖరున కొంచెం ఆవేశం వచ్చేసింది.

అందరూ రకరకాలుగా మాటలు మొదలుపెట్టేశారు.

ఒక పెద్దాయన " నువ్వు చెప్పిందే నిజమమ్మా. మునుపు మనూరు ఎలా వుండేదీ? సుభాష్ బాబు వచ్చాక ఎంతలా మారిపోయిందీ! ఇదంతా ఆయన చలవేకదూ!" అన్నాడు.

" అవును...నిజం.." అంతా గోలగోలగా అన్నారు.

ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడకపోవటం అవనికీ సంతోషం కలిగించింది!

మంచి చేసిన మనిషికి సన్మానాలూ, సత్కారాలూ చేయనక్కరలేదు. కానీ కనీసం గుర్తించి గౌరవం చూపించటం సంస్కారం! అనుకుంది అవని తనలో తానే!

" నిజమే అవనీ..నేనంతగా ఆలోచించలేదు! సుభాష్ గారు ఈ ఊరుకి చేసిన ఉపకారాన్ని గుర్తించకుండా ఇంకోలా మాట్లాడటం నాది తప్పే!" అన్నాడు మెల్లగా అతను.

అవని చిరునవ్వు నవ్వింది.

" గొప్పతనాన్ని గుర్తించి గౌరవం చూపించటమే కాదు, తప్పు తెలుసుకుని ఒప్పుకోగలగటం కూడా చాలా మంచి లక్షణం అన్నయ్యా! నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా! " అంది అవని.

ఇంకెవరో " ఊరుకి ఆయన పేరు పెట్టుకుందామా...అది గౌరవం చూపించినట్లుగా ఉంటుందిగా" అన్నారు. దానిమీద మళ్ళీ చర్చ ప్రారంభమైంది!

" ఊరి పేరు ' చీకురుపల్లె ' ! ఆ పేరు ఎందుకొచ్చిందో, ఏమైనా విశిష్టత ఉన్నట్లూ మనకేమీ తెలియదు. కాబట్టి మనం అందరం అనుకుని మార్చుకుందాం. సర్పంచ్ గారికి కూడా చెప్పి సలహా అడుగుదాం.." అని ఇంకెవరో తీర్మానించారు.

చివరకు అందరూ ఆలోచించి...చిన్నవాడు సుభాష్ పేరు కాకుండా...ఈ ఊరుతో బంధం వున్న అతని తాతగారు ఆనందరావుగారి పేరుతో ' ఆనందపురం ' అని మార్చితే బావుంటుందనే నిర్ణయానికి వచ్చారు. ఆ విషయం మరునాడే అందరికీ తెలిసింది. అందరూ ' బావుంది...అలాగే చేయాలి ' అంటూ ఆనందాన్ని ప్రకటించారే తప్ప ఎవరూ వ్యతిరేకించలేదు!

అవని ఈ విశేషాలన్నీ ఆ రోజే సుభాష్ కి ఫోనులో చెప్పింది.

" నిజమా...నిజమా...అలా చేశారా..." అంటూ విస్మయాన్ని చూపించాడు.

" ఈ ఊరివాళ్ళందరూ ఇలాగైనా గౌరవం చూపించాలనుకున్నారు! " అంది.

" తాతగారిపేరనే కాకుండా 'ఆనందపురం' అనేదీ నాకు బాగా నచ్చింది! నాకూ ఇది చాలా ఆనందం కలిగించే విషయమే!" అన్నాడు సుభాష్.

" అవనీ...అమ్మ చెప్పిన పనీ చేశాను. అమ్మ ఆశీర్వాదం ఫలించినట్లుగా నా అభిరుచులకి అనుగుణమైన అమ్మాయే సహచరిగా లభించింది!"

" నిజంగా....మీ అభిరుచులకి అనుగుణమని ఎందుకు అనుకుంటున్నారూ?"

" నేనన్న మాటకి అంగీకరించినట్లుగా 'అదిసరేగానీ' అంటూ మొదలుపెడుతుంది మరి!"

" ఇప్పుడలాగే అనిపించవచ్చు. ఆ తర్వాత మారిపోయే అవకాశమూ ఉంటుంది! ముందే మురిసిపోకూడదు!"

" అవును కదా..అవనిలో రుతువు రుతువుకూ మార్పులు రావటం సహజమే! మార్పులు మంచివే..అవీ మురిపిస్తాయి!"

" నేనన్నది...ప్రకృతిలో మార్పుల్ని గురించి కాదుగా! మీకు అనుకూలవతి అంటూ మీరు మురిసిపోతున్నారుగానీ..కసుర్లూ, విసుర్లూ కూడా ఎక్కువేనని తెలుసుకోమంటున్నా!"

" ఏ విధంగానైనా నాకూ ఇష్టమేననే నేనూ చెబుతున్నా! వేసవి ప్రతాపంలా కోపం చూపించినా...హర్షాన్ని కలిగించే వర్షం నవ్వుల్ని రువ్వినా...కాలంలో వెచ్చని సామీప్యంతో చల్లని చూపుల్ని కురిపించినా.....అన్నిటికీ ఆనందమే..!"

" అబ్బ! ఆశువుగా కవిత్వం చెప్పేస్తున్నారే!"

" ఇష్టమైన అమ్మాయితో జత కుదిరితే...ఏ అబ్బాయి అయినా కాళిదాసు అయిపోతాడు కాబోలు! నాకీ విషయం ఇప్పుడే తెలిసింది!"

" అయితే కాళిదాసు గారూ...ఒకటి అడగనా?" హాయిగా నవ్వుతూ అంది.

" చెప్పానుగా...పర్మిషన్ అక్కర్లేదని.."

" అవునవును...గుర్తొచ్చింది! చెవి మెలేసి అడిగే వీలు లేకుండా దూ...రంగా ఉన్నారుగా"

" అమ్మో...దగ్గరగా వున్నప్పుడు ప్రతీ మాటకీ నిజంగా చెవి మెలేసేలా ఉన్నావే!"

" ఖచ్చితంగా చేస్తాను ఆ పని! పర్మిషన్ ఇచ్చే ముందే ఆలోచించుకోవాలి!"

" నాకంత ముందు చూపు, ఆలోచన లేవని ఒప్పుకుంటున్నాగానీ...అవనీ...నాకు నిద్ర వచ్చి...మంచి కలలు వచ్చేలా తీయని కబుర్లు చెప్పకూడడూ ?"

" మీలా నాకు చేత కాదు.."

" నీలాగే....నువ్వు చెప్పు..నాలాగ చెప్పటం ఎందుకూ ?"

" ఇదిగో...ఇలాంటి మాటల మెలికలే ...నాకు చేతకాదు...ప్రస్తుతానికి ! ముందు ముందు మీ సహచర్యంలో నేర్చుకోగల్గుతానేమో! అదిసరేగానీ....నేను అడగాలనుకున్నది...ఈ వేళ వరాలు ' మనం ఎక్కడుంటాం ?' అనడిగింది. అపుడు నాకూ సందేహం వచ్చి..ఇప్పుడు అడగాలని అనుకున్నా ?"

" ఇక్కడ కొన్నాళ్ళు.. ఉండి..తర్వాత సంచార జీవితమే! నీకూ ఊళ్ళు తిరగటం అలవాటేగా...ఉద్యోగంలో అని నా ఉద్దేశ్యంలే!"

" అంటే...ఏమిటని ?"

" ఇక్కడ కొన్నాళ్ళలో...హాస్పిటల్ ప్రారంభం అవుతుంది! కాలేజీ కూడా మొదలవుతుంది! ఇక ఈ ఆనందపురం నుండి మకాం మార్చేసి..ఇంకో ఊరుకి వెళ్ళి ఈ ఊరుని ఆదర్శంగా తీసుకుని ఎలాంటి సూచనలు ఇవ్వాలో..ఇచ్చి....కొన్నాళ్ళ తర్వాత మరో ఊరుకి...అంటే....ఎవరికి వారే ఎలా అలంకరణ చేసుకుంటారో...అలాగే ఊరుని తమదిగా అనుకుని ఊరి వారందరూ కలిసి ఊరుని పరిశుభ్రంగా తీర్చిదిద్దుకునే పాఠాలు చెబుతుంటా!

నీ ఉద్యోగం...నీదే..నాది..ఇలా ప్రస్తుతానికి అనుకుంటున్నా. అందరూ పూనుకుని తమ ఊరుని ఆనందపురంగా మార్చుకోగలగాలి! ఈ చుట్టుపక్కల ఊళ్ళన్నీ ఆనందపురం- ఒకటి, ఆనందపురం - రెండు అలా మారిపోతాయి! ఆంధ్రప్రదేశ్ లోని పల్లెలన్నీ ఇక ఆనందపురాలే!"

" నిజంగా ? అలా తిరుగుతూండాలనేదే మీకు ఇష్టమా ?"

" అవును...మీ అమ్మా వాళ్ళకీ, నాన్నమ్మ, అమ్మమ్మలకీ దూరం వెళ్ళిపోకుండా ఈ చుట్టుపక్కల ఊళ్ళలోనే ..మీ వాళ్ళ చుట్టూనే తిరగటం....నీకూ బావుండదా?"

" నా ఉద్యోగమే అంత అనుకుంటుంటే..మీరూ పాఠాలు చెప్పుకుంటూ ఊళ్ళు తిరగాలని అనుకుంటున్నారా?"

" అవును అవనీ...నా కళ్ళ ముందు భవిష్యత్ లోని ఒక దృశ్యం చోటుచేసుకుంది! చెప్పనా? ముందు నేను నడుస్తున్నాను...వెనక ఇద్దరు పిల్లలతో నువ్వు..వస్తున్నావు...ఒకరి చేయి పట్టుకునీ..ఇంకొక పిల్లాడిని ఎత్తుకునో...."

" ఇదేమన్నా బావుందా? ఇంత అన్యాయమా? నేను ఇద్దరితో సతమతమవుతూ రావాలా....మీరు చేతులూపుకుంటూ కులాసాగా నడుస్తారా?"

" అయితే సరేలే...నేనొకరి చేయి పట్టుకుని నడిపిస్తాలే.."

" అదేం కుదరదు..చంటిదాన్ని ఎత్తుకునే నడవాలి!"

" అంటే...నువ్వు...చంటాడిని చేయి పట్టుకుని నడిపిస్తావా? నడవగలడంటావా?"

" ఏమో..నాకేం తెలుసూ..మీరేగా ఒకరు నడుస్తున్నారని అన్నారూ....అంటే...మూడు నాలుగేళ్ళు ఉండే ఉంటాయి? అయినా పిల్లలని నేను పట్టుకోలేను. ఇద్దర్నీ మీరే చూసుకోవాలి!"

" అప్పుడు...నువ్వు చేతులూపుకుంటూ వస్తావా?"

" అదిసరేగానీ...నేను వెనక రావటం ఏమిటీ?"

" అంటే...నువ్వు ముందు నడుస్తానంటావా? సరేలే...అలాగే కానీయ్...నేను ఇద్దరు పిల్లలతో చక్కగా ఆడుతూ పాడుతూ వెనకే నిదానంగా వస్తా సరేనా?"

" అదీ సరికాదు! అసలు అలా ఎందుకూ? ఇద్దరమూ పక్కపక్కనే కలిసి నడుస్తూ...ఒకరు చిన్న పిల్లని ఎత్తుకునీ....మరొకరు పిల్లాడి చేయి పట్టుకునీ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ సాగాలి! కాసేపు తర్వాత పిల్లని ఇంకొకరు ఎత్తుకోవటంగా మార్చుకుంటే సరిపోతుంది! అదీ ఆడుతూ పాడుతూ హాయిగా సాగటమంటే! ముందూ వెనకా కాదు..అది వెనకటి పద్ధతి...ఇప్పుడు చెల్లుబాటు కాదు! తెలిసిందా?"

" ఇంత వివరంగా చెప్పినా తెలియలేదని ఎలా అంటానుగానీ...నాకు భలే నవ్వొస్తోంది! నీకు రావటంలేదా?"

ఒక క్షణం ఆలోచించి.." అవును ఇదేమిటీ..మనం పిల్లలూ పిచుకలూ అంటూ అపుడే అంత దూరం వెళ్ళిపోయాం! ఇక చాలిద్దాం...!" అంటూ అవని కూడా హాయిగా నవ్వింది.

*****

ఆ రోజు...హాస్పిటల్ ప్రారంభోత్సవం జరిగింది.

ఊరంతా ఆనందం వెల్లివిరిసింది! ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రిగారు ఊరి వారందరి కృషికీ, సుభాష్ సమర్థవంతమైన సారధ్యానికీ ప్రశంసల జల్లు కురిపించారు!

ఆయన ప్రసంగంలో " సరైన సారధ్యంలో...అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే...ఎలాంటి అభివృద్ధి సాధించవచ్చునో ఈ ఊరు ప్రజలు నిరూపించారు! ఈ ఊరును అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించిన...కాదు..పరుగులు పెట్టించిన

సుభాష్ నీ అభినందిస్తున్నాను! ఈ ఊరు సాధించిన ప్రగతి...అన్ని గ్రామాలకీ స్ఫూర్తిదాయకం కాగలదని అనుకుంటున్నాను.

ఈ ఊరు నాద్వారానే ' ఆనందపురం ' గా పేరు మార్చుకోవటం నాకూ ఆనందదాయకమే! ఆనందానికి చిరునామాగా ఈ ఊరు ఎప్పటికీ గుర్తింపబడాలనే కోరుకుంటున్నాను! ప్రకృతివైపరీత్యాలకి తట్టుకోగలగటానికీ, అవసరాలకీ ఆర్ధిక సాయం అందించే నిధిని రైతులందరూ కలిసి ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిసి, ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకరంగా ఇవ్వగలిగే సాయాన్నీ పరిశీలిస్తానని మాట ఇస్తున్నాను!" అంటూ చెప్పారు.

" ఈ ఊరి అబ్బాయే కొన్నాళ్ళ తర్వాత మా మధ్యకు తిరిగి వచ్చి మాకు అండగా నిలిచాడు సుభాష్ బాబు. ఇక్కడికి వచ్చిన కొత్తలో ' ఏ ఊరివాడు, ఇక్కడ ఇన్నాళ్ళు ఎందుకు ఉంటున్నాడు...ఏం చేయబోతున్నాడు...' అని కొంచెం అనుమానించటమూ జరిగింది. ఆ తర్వాత అతని ధ్యేయాన్ని తెలుసుకోగలిగాం! ఈ ఊరు ఇప్పుడు ఇలా పచ్చని పల్లెగా పేరుపొందటానికీ, అన్ని విధాలగానూ పురోగతి సాధించటానికీ సుభాష్ బాబు కృషేనని అంగీకరించి..కృతజ్ఞతగా సుభాష్ తాతగారు, మా ఊరు వ్యక్తీ అయిన ఆనందరావుగారి పేరున ' ఆనందపురం ' గా మార్చుకుంటున్నాం!" అని ఊరి ప్రజలందరి తపఫునా ఒక పెద్దాయన మాట్లాడటం జరిగింది.

సుభాష్ కూడా క్లుప్తంగా నాలుగు మాటలు చెప్పాడు. " ఏ పని అయినా ఒక్కరివల్లే వీలుకాదు. ఎంతోమంది చేతులు కలిపితేనే సాధ్యమవుతుంది! ఐక్యతతో ఈ ఊరు సాధించిన ప్రగతే దీనికి నిదర్శనం! నేను నామ మాత్రంగా సూచనలిచ్చాను.ఈ ఊరి యువకులూ, పెద్దలూ ఉత్సాహంగా ఆచరించారు!" అంటూ తనకి స్ఫూర్తి కలిగించిన వ్యక్తుల్నీ, వార్తల్నీ కూడా తలుచుకున్నాడు. ఆ తర్వాత " ఈ ఊరు రావటానికి ఒక కారణం ఉన్నా, నేను ముఖ్యంగా కలుసుకుని అభినందించాలని తపనని కలిగించిన వ్యక్తి భీమన్న!   అతను తలపెట్టిన జలయజ్ఞాన్ని అందరూ చేతులు కలపటంతో త్వరితగతిన పూర్తయింది! ఘనత మాత్రం భీమన్నదే! అతనే నా స్ఫూర్తిప్రదాత!" అంటూ భీమన్నను స్టేజిపైకి పిలిచి పూలదండలతో సన్మానించాడు. భీమన్నా ఆనందంతో పులకించిపోయాడు!

ఇక ఆ తర్వాత...ఆ ఊరులో ఆనందంగా జరిగే వేడుక అవనీ..సుభాష్ ల పెళ్ళేనని అనుకున్నారంతా!  అవనీ..సుభాష్ లు కూడా ఆనందపురంలోనే స్థిరనివాసం ఏర్పరచుకుని, పనుల మీద ఎక్కడికైనా వెళ్ళిరావటమే బావుంటుందని నిర్ణయించుకున్నారు!

ఆ వార్త అందరికీ ఆనందాన్ని కలిగించింది!

-: అయిపోయింది :-